నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

-ప్రిన్సిపాల్ దాసి రాజేందర్

వర్గల్, డిసెంబరు 12 (ప్రభాతవార్త): జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికై నిర్వహించే ఎంపిక పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 22 పరీక్ష కేంద్రాల్లో సెంటర్ సూపరింటెండెంట్లు, సెంటర్ లెవల్ అబ్జర్వర్లు ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. మెదక్ జిల్లాలో 6, సిద్దిపేట జిల్లాలో 7, సంగారెడ్డి జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 4754 మంది అభ్యర్థులు ఈ ప్రవేశ ఎంపిక పరీక్షకు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రవేశ ఎంపిక పరీక్ష సజావుగా జరిగేందుకు మూడు జిల్లాల కలెక్టర్లు, విద్యా శాఖ అధికారుల సలహాలు, సూచనలతో ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ప్రవేశ ఎంపిక పరీక్ష 13వ తేదీ శనివారం ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి అశ్విక ఎంపిక

సదాశివపేట, డిసెంబరు 12 (ప్రభాతవార్త): సదాశివపేటలోని విజ్ఞాన్ మోడల్ హైస్కూల్ విద్యార్థిని అశ్విక స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్‌లో బంగారు పతకాన్ని సాధించింది. మోమిన్‌పేట మండలంలోని మేకవనంపల్లిలో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్ 14లో బాలికల విభాగం నుంచి 22 వెయిట్ కేటగిరిలో అశ్విక బంగారు పతకాన్ని సాధించిందని తెలంగాణ స్టేట్ జేకేఏ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శంకర్‌గౌడ్ అన్నారు. రేపటినుంచి 19వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు అశ్విక వెళుతున్నట్లు ఆయన తెలిపారు. అక్కడ జరగబోయే బాలికల విభాగం అండర్ 14లో 22 వేట్ కేటగిరిలో తలపడనుందని శంకర్‌గౌడ్ తెలిపారు. జాతీయస్థాయిలో గెలుపొంది ఇలాంటి బంగారు పతకాలు ఇంకా సాధించాలని చదువుతున్న పాఠశాలకు తల్లిదండ్రులకు గురువులకు తన ద్వారా ఇంకా గుర్తింపు రావాలని సంగారెడ్డి జిల్లా శాసన సభ్యుడు, జెకెఏషో టాకాన్ ప్రెసిడెంట్ చింత ప్రభాకర్ అశ్వికను అభినందిస్తూ అన్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అనురాధ శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అశ్వికను అభినందించారు.

క్రిటికల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న హైమావతి

పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లాలోని సిద్దిపేట డివిజన్‌లోని రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జిల్లా ఎన్నికలఅధికారి, కలెక్టర్ హైమావతి దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి, తొగుట మండలాల్లోని పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుబ్బాక మండల పరిధిలోని పెద్దగుండవెల్లి జడ్పీ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, హబ్సీపూర్ జడ్పీ పాఠశాల, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని పోతిరెడ్డిపేట జడ్పీ పాఠశాల, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఖాజీపూర్ జడ్పీ, రుద్రారం జడ్పీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మిరుదొడ్డి మండల పరిధిలోని చెప్యాల జడ్పీ పాఠశాల, అల్వాల్ జడ్పీ పాఠశాల, తొగుట మండలం గుడికందుల జడ్పీ పాఠశాల, పెద్దమాసాన్‌పల్లి, మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో రెండోవిడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిపేందుకు అధికారులు పోలింగ్ స్టేషన్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల అధికారులకు సూచించారు. ఆమె వెంట ఆయా మండలాల ఎంపిడివోలు, తహసీల్దార్లు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన తొలి విడత పంచాయతీ ఎన్నికలు

సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 12,ప్రభాతవార్త: జిల్లాలో తొలి విడతగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్టు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. తొలి విడత పోలింగ్ ముగిసిన నేపథ్యంలో, రెండవ విడత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సహకరించిన అధికారులు, సిబ్బందికి, పోలీసులు, గ్రామస్థాయి సిబ్బందికి, ఓటర్లు, మీడియా ప్రతినిధులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన ప్రచారం..మొదలైన ప్రలోభాల పర్వం

-ఓటర్లకు పెద్దఎత్తున డబ్బుల పంపిణీ

జహీరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త: మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు ఈ నెల 14న జరగనున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. 10 రోజులుగా ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పార్టీలకు అతీతంగా జరుగుతున్న పంచాయితీ ఎన్నికలు పరోక్షంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు తమ మద్దతుదారులను రంగంలోకి దింపి ప్రచారం నిర్వహిస్తున్నారు. అధిక గ్రామాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు రేబల్ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. పలు గ్రామాల్లో కార్యాలయాలను తెరుచుకుని కార్యకర్తలకు విందులు అందచేస్తున్నారు. బిఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యే మానిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ ఎం శివకుమారర్‌తోపాటు ఆయామండల పార్టీ అధ్యక్షులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ ఎస్ ఉజ్వల్‌రెడ్డిలతో పాటు ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడటంతో ఆయా మండల పార్టీల ముఖ్య నాయకులు గురువారం నుంచే గ్రామాల్లో ఓటర్లకు డబ్బులు పంపిణి చేస్తున్నారు. ఓటరుకు 1 వేయి నుంచి 3 వేల రూపాయల వరకు డబ్బులు పంపిణిచేస్తూ తమకు మద్దతు పలకాలని అభ్యర్థిస్తున్నారు. గ్రామాల నుంచి వలస వెళ్లిన వారిని ఎన్నికలకు వచ్చి తమకు ఓటు వేయాలని పెద్దఎత్తున డబ్బులు ఫోన్‌పే, గూగుల్ పే ద్వార పంపుతున్నారు.

మొగుడంపల్లి మండలంలో...

మొగుడంపల్లి మండలంలోని 22 గ్రామ పంచాయతీ లలో 4 గ్రామ పంచాయితీలు (మిర్జాంపల్లి తండా, హరిచంద్రనాయక్ తండా, పడయాల తండా, మన్సాపూర్ పంచాయతీలు) ఏకగ్రీవం కాగా మిగిలిన 18 గ్రామ పంచాయితీలకు ఈ నెల 14న పంచాయితీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రామపంచాయతీ ఎన్నికలు

-మండలంలో 89.59 శాతం పోలింగ్

మర్కుక్ మండలంలో గెలుపొందిన నూతన సర్పంచులు

మర్కుక్, డిసెంబరు 12 (ప్రభాతవార్త): గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలు మర్కుక్ మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 16 గ్రామపంచాయతీలు ఉండగా ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల సర్పంచులు ఏకగ్రీవం కాగా మిగతా 14 గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం 1 గంటల వరకు ఎన్నికలు జరగగా 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించగా రాత్రి పొద్దుపోయే వరకు ఓట్ల లెక్కింపు కొనసాగింది. మండలంలో మొత్తం 15,887 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోగా 89.59 శాతం ఓటింగ్ జరిగింది. ఎర్రవల్లి గ్రామ సర్పంచ్‌గా కవిత రాంమోహన్‌రెడ్డి (బిఆర్ఎస్), నర్సన్నపేట గ్రామ సర్పంచ్‌గా గిల్క బాల్‌నర్సయ్య(బిఆర్ఎస్) ఏకగ్రీవంగా ఎన్నికకాగా గురువారం జరిగిన ఎన్నికల్లో అంగడికిష్టాపూర్ సర్పంచ్‌గా కొండల్‌రెడ్డి(ఇండిపెండెంట్), భవానందపూర్ సర్పంచ్‌గా సత్తమ్మ (బిఆర్ఎస్), చేబర్తి సర్పంచ్‌గా ర్యాకం యాదగిరి(కాంగ్రెస్), దామరకుంట సర్పంచ్‌గా పత్తి నర్సింలు (కాంగ్రెస్), గణేష్‌పల్లి సర్పంచ్‌గా రామరాజు (ఇండిపెండెంట్), గంగాపూర్-యూసుఫ్‌ఖాన్‌పల్లి సర్పంచ్‌గా శ్యామల (బిఆర్ఎస్), ఇప్పలగూడెం సర్పంచ్‌గా నాగిరెడ్డి(కాంగ్రెస్), కర్కపట్ల సర్పంచ్‌గా కవిత (కాంగ్రెస్), కాశిరెడ్డిపల్లి సర్పంచ్‌గా భాస్కర్ (కాంగ్రెస్), మర్కుక్ సర్పంచ్‌గా రాణి (బిఆర్ఎస్), పాములపర్తి సర్పంచ్‌గా భవాని (బిఆర్ఎస్), పాతూరు సర్పంచ్‌గా భారతి (బిఆర్ఎస్), శివారువెంకటా పూర్ సర్పంచ్‌గా కనకయ్య(బిఆర్ఎస్), వరదరాజపూర్ కిష్టయ్య (కాంగ్రెస్) గెలుపొందారు.

మామను హత్య చేసిన అల్లుడు

అమీన్‌పూర్, డిసెంబరు 12, ప్రభాతవార్త :

అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడ మంజీరా కాలనీలో నివాసం ఉంటున్నా చంద్రయ్య కుటుంబం, మూడు నెలలు గడుస్తున్న అమ్మ వాళ్ళ ఇంట్లోనే ఉంటావా అని గొడవకు దిగిన అల్లుడు కడమంచి రామకృష్ణ, నిన్న రాత్రి మామ చంద్రయ్యతో ఘర్షణ పెట్టుకొని నీ అంతు చూస్తా అని మాటల తగాదా తీవ్రమవడంతో ఆగ్రహానికి లోనైనా అల్లుడు ఇంటికి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి అతి కిరాతకంగా విచక్షణ రైతంగ దాడి చేయడంతో రక్త గాయాలతో ఉన్న చంద్రాయను వెంటనే హాస్పిటల్ తరలియడంతో మృతుడు చికిత్స పొందుతూ నిన్న రాత్రి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించమని తెలిపారు. మృతుని కూతురు కడమంచి లక్షి ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం అని, సిఐ నరేష్ తెలిపారు.

హుస్నాబాద్ గౌరవం పెరిగేలా కృషి చేస్తా

రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 12, ప్రభాతవార్త రాష్ట్రంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎక్కడికి వెళ్లినా వారి గౌరవం పెరిగేలా చేస్తానని ఎన్నికల సమయంలో ఈ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చానని, ఇచ్చిన హామీ మేరకు సాధ్యమైనంత వరకు ప్రయత్నాలు కొనసాగిస్తూన్నానని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన భీమదేవరపల్లి, ఎలకతుర్తి మండలాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలని, అండగా ఉంటానన్నారు. మొదటి దశ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలంలో పోలింగ్ జరిగిందని, గెలిచిన ప్రజాప్రతినిధులు గాంధీజీ కలలు కన్న విధంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాలలో ఎలాంటి సమస్య ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు మొదటిదశలో మంజూరు చేశామని, రెండవ దశ త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. రాష్ట్రంలో నియోజక వర్గం ఆదర్శంగా ఉండాలని స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశామని, క్యాన్సర్ రాకుండా ప్లాస్టిక్ నిషేధిస్తూ హోటల్‌లు, ప్రతీ గ్రామానికి స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశామని, మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. మరింత అభివృద్ధికి సంబంధించిన జిల్లా అధికారులను పిలిచి త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తానని, ఎన్నికల కోడ్ అయిపోగానే గ్రామాల అభివృద్ధికి సంబంధించి నిధులు మంజూరు చేస్తామన్నారు. భీమదేవరపల్లి మండలంలో 15 స్థానాల్లో, ఎలకతుర్తి 11 గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుందన్నారు. నియోజకవర్గంలో 173 గ్రామ పంచాయతీలకు 16 ఏకగ్రీవంగా గెలిచారని, 14వ తేదీన చిగురుమామిడి, 17న హుస్నాబాద్, కోహెడ అక్కన్నపేట, సైదాపూర్ మండలాల్లో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించి తనకు బలాన్ని ఇవ్వాలని అభివృద్ధి విషయంలో అన్నిరంగాల్లో నెంబర్ ఉండేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసుకొని ఈ ప్రాంతానికి నీళ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న 173 మంది సర్పంచ్‌లకు పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి ప్లాన్ ఆఫ్ యాక్షన్‌పై శిక్షణ ఉంటుందన్నారు. శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి రూ. 100 కోట్లు కేటాయించాలని దానికి సంబంధించిన నివేదిక తయారు చేయాలని వైస్ చాన్సలర్‌ను ఆదేశించారు. జిల్లా మంత్రులం కలిసి ముఖ్యమంత్రికి యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతామని తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండో విడత ఎన్నికలకు సర్వం సిద్ధం చేసుకోవాలి

సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లాలో రెండో విడత సిద్దిపేట డివిజన్‌లోని సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, నంగునూర్, నారాయణరావుపేట, చిన్నకోడూరు, అక్బర్‌పేట-భూంపల్లి, దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, హుస్నాబాద్ డివిజన్‌లోని బెజ్జంకి 10 మండలాల్లో 182 గ్రామ పంచాయతీలకు 1644 వార్డుల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం గ్రామ పంచాయతీ ఎలక్షన్‌కు సంబంధించి ఆర్డీఓ, ఎంపిడివో, ఎంపివో, తహసీల్దార్లు ఇతర అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి అధికారులకు ఎలక్షన్ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకగ్రీవం అయిన గ్రామాలు, వార్డులను మినహాయిస్తూ మిగిలిన పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 13న ఆయా మండలాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్‌సెంటర్లకు అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ బాక్స్ ఇతర మెటీరియల్ పంపిణీకి సౌకర్యంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. సరిపడే బస్సులు, పోలింగ్ సిబ్బంది మెటీరియల్ పంపిణీ చేసుకొని ఆయా జోనల్ ఆఫీసర్‌లు కేటాయించిన రూట్లో లంచ్ తర్వాత పోలింగ్ స్టేషన్‌లకు వెళ్లేందుకు సిద్ధం కావాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో సిబ్బంది ఫర్నిచర్, బ్యాలెట్ బాక్స్ అన్ని సమకూర్చుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ సిబ్బంది టిఫిన్, లంచ్ సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. 14న ఉదయం మాక్ పోల్ మొదలుకొని ఉదయం 7 గంటలకు ఓటింగ్ మొదలు పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 1 వరకు ఓటర్లు లైన్‌లో ఉంటే వారికి టోకెన్ అందించివారికి మాత్రమే ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అనుమతించాలన్నారు. 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పోలింగ్‌స్టేషన్, కౌంటింగ్ కేంద్రంలోకి ఫోన్ అనుమతి లేదని తెలిపారు.

గ్రామాల్లో బిఎల్ఓలు వంద శాతం ఓటర్ స్లిప్స్ పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, జడ్పీ సీఈవో రమేష్, డిపిఓ, డిఆర్‌డిఎపిడి జయదేవ్ ఆర్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిపై నిరక్ష్యం ఎందుకు...!?

బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు



మాట్లాడుతున్న శంకర్‌బాబు

హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 12, ప్రభాతవార్త : హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిపై మున్సిపల్ ఏఈ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ప్రశ్నించారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంప్యూటర్స్, ఇతర పరికరాల కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గత 11 నెలల క్రితం రూ 6 లక్షలు మంజూరు చేశారని, దాని కోసం మున్సిపల్ ఏఈ టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, ప్రభుత్వ ఆసుపత్రికి కంప్యూటర్స్ అందజేయాలని, కానీ ఏఈ టెండర్ పిలిచి, 11 నెలల గడుస్తున్నా ఇంత వరకు ప్రభుత్వ ఆసుపత్రికి కంప్యూటర్స్ అందజేయకపోవడం చూస్తుంటే అధికారులు, కాంట్రాక్టర్ యొక్క నిరక్ష్యం కనిపిస్తుందని, అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రభుత్వం ఆసుపత్రిలోని జనన ధృవీకరణ, మరణ ధృవీకరణ పత్రాలు ఆలస్యం అయి ప్రజలు ఇబ్బందులకు పడుతున్నారన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర మంత్రి నిధులు కేటాయిస్తే, ఏఈ కాంట్రాక్టర్ మొద్ద నిద్ర పోతూ, తమకు పెద్ద టెండర్ల అయితే కమీషన్ వస్తుందని, ఈ చిన్న మొత్తానికీ ఏం వస్తుందనే ధోరణితో ఇద్దరు ఉన్నట్టు అనిపిస్తోందన్నారు. ఈ విషయంలో అధికారులు వారంరోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రికి కంప్యూటర్స్ రీటెండర్ పిలిచి అందజేయాలని, విధులపట్ల నిర్యక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏఈల పై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

శాంతియుతంగా, నిస్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు

ప్రజలు పోలీసులకు సహకరించాలి

సిద్దిపేట సిపి విజయ్‌కుమార్

మాట్లాడుతున్న సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లాలో రెండో విడత నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా నిస్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట డివిజన్‌లోని సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, నంగునూర్, నారాయణరావుపేట, చిన్నకోడూరు, అక్బర్‌పేట-భూంపల్లి, దుబ్బాక, తొగుట,మిరుదొడ్డి, హుస్నాబాద్ డివిజన్‌లోని బెజ్జంకి 10 మండలాల్లో 163 బిఎన్ఎస్ఎస్(144సెక్షన్) అమల్లో ఉన్నందున ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుంపులుగా గుమికూడొద్దన్నారు. ఈనెల 12 సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ పూర్తయ్యేవరకు సైలెంట్ పిరియడ్ అమల్లో ఉంటుందని, ఈ సమయంలో ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింట ప్రచారం, లౌడ్ స్పీకర్ వినియోగం ర్యాలీలు, బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధించడం జరుగుతుందన్నారు. బూత్ లో ఇచ్చే చీటీలపై అభ్యర్థి పేరు లేదా గుర్తు లేదా రాజకీయ పార్టీ పేరు ఉండకూడదని కేవలం తెల్ల కాగితంపై మాత్రమే ముద్రించాలన్నారు. పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలో లేదా 100 మీటర్ల పరిధిలోపల ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్‌లు, వైర్‌లెస్ సెట్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించడానికి లేదా తమ వద్ద ఉంచుకోవడానికి అనుమతి లేదన్నారు. ఎన్నికల భద్రత దృష్ట్యా మద్యం దుకాణాలు ఈ నెల 15 ఉదయం 10 గంటల వరకు మూసివేయాలన్నారు.

ఎవరైనా మద్యం అక్రమంగా రవాణా, నిల్వ చేసినా లేదా తమ వద్ద ఉంచుకున్నా వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రంలోకి సిరా(ఇంక్) వాటర్ బాటిళ్లు, కత్తులు లేదా భద్రతా సిబ్బంది అనుమానించే ఇతర ఎలాంటి వస్తువులను తమ వెంట తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి అనుమతి లేదని నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా ర్యాలీలు, నిర్వహిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు స్వచ్ఛంగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు.

ర్యాగట్లపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన మంతూరి సౌందర్యకు ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

గజ్వేల్ మండలంలో పై 'చేయి'

-నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ హవా

గజ్వేల్, డిసెంబరు 12 (ప్రభాతవార్త): గజ్వేల్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పది సంవత్సరాలలో గజ్వేల్ నియోజకవర్గానికి వేల కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ రెండు సంవత్సరాల క్రితం జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడంతో రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగిస్తుంది. ఐదు సంవత్సరాల నుండి గ్రామాల్లో గ్రామ కార్యదర్శులచే పాలన కొనసాగిస్తుండగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు సిద్దిపేట జిల్లాలోని ఏడు మండలాల్లో నిర్వహించగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రతి మండలకేంద్రాల్లో బిఆర్ఎస్‌కు పట్టం కట్టారు. నియోజకవర్గంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలు రావడంతో గులాబి శ్రేణులు అయోమయంలోపడ్డారు. కెసిఆర్ చేసిన అభివృద్ధి గ్రామాల్లో జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి అనుకున్న స్థాయిలో సర్పంచ్ స్థానాలను దక్కించుకోలేకపోయారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపొందడంతో అదే ఊపుతో గ్రామపంచాయతీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ పుంచుకుంది. పది సంవత్సరాల నుండి గజ్వేల్ నియోజకవర్గం కెసిఆర్ అడ్డాగా ఉన్నప్పటికీ ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. ఇదిలా వుండగా మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి గ్రామమైన వర్గల్‌లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలవగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు శ్రీకాంత్‌రావు గ్రామంలో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గ్రామంలో తన అనుచరుడు బిఆర్

సుభాష్ నగర్ డివిజన్‌కి ఎస్సార్ నాయక్ నగర్ డివిజన్‌గా పేరు పెట్టాలి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జీడిమెట్ల, డిసెంబర్ 12, ప్రభాతవార్త

ఇటీవల డివిజన్ల మారుస్తూ సుభాష్ నగర్ డివిజన్‌గా సుభాష్ నగర్ ఏరియా లేనప్పటికీ సుభాష్ నగర్ పేరు పెట్టిన నేపథ్యంలో ఎస్సార్ నాయక్ నగర్ డివిజన్‌గా పేరు పెట్టాలని ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరి వెంకట శేషాచారి శుక్రవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ ఉప కమిషనర్ నరసింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. అన్ని రకాలుగా ఎస్ఆర్ నాయక్ డివిజన్ అయితే రెవెన్యూ పరంగా కూడా బావుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు ఆర్థిక సహాయం

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

పేట్ బషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త

రంగు రాజమ్మ సేవాసమితి ప్రతినిధులు ఇద్దరు క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం కోకో పోటీలో నేషనల్ లెవల్లో సెలెక్ట్ అయిన ఇద్దరు విద్యార్థినిలకు రంగు రాజమ్మ సేవా సమితి ప్రతినిధులు అండగా నిలిచి కొంత నగదును అందజేశారు. ఈనెల చివరి వారంలో మధ్యప్రదేశ్ జబల్పూర్ ప్రాంతంలో జరిగే అండర్ 19 కోకో పోటీలకు జీడిమెట్ల ప్రాథమిక పాఠశాలలో చదువుకునే శాంతి, మైథిలి ఇద్దరు సెలెక్ట్ కావడంతో వారికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం కొంత నగదును రంగు రాజమ్మ సాయిలు జ్ఞాపకార్థం అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, కళ్యాణి, ఫిజికల్ డైరెక్టర్ అరుణ జ్యోతి చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ గ్రామవాసి అశోక్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

-సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి నారాయణ

కార్మికులనుద్దేశించిర మాట్లాడుతున్న సీపీఐ మాజీ కార్యదర్శి నారాయణ

నాచారం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : నాచారం పారిశ్రామిక వాడలోని షాహి ఎక్స్పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికుల చేపట్టిన 5వ రోజు నిరసన ధర్నా కార్యక్రమానికి సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి నారాయణ శుక్రవారం విచ్చేసి పూర్తి మద్దతు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ. నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్ రెడ్డి,కె. ధర్మేంద్ర, రచ్చ కిషన్, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్ ఇతర ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. సిపిఐ జాతీయ నేత కె.నారాయణ సాయి ఎక్స్ ప్రెస్ మహిళా కార్మికులు చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నారని తెలుసుకొని ఆందోళన కార్యక్రమానికి వచ్చిన డిప్యూ టీ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్మెంట్ శ్యాంసుందర్ మాట్లాడుతూ షాహి ఎక్స్పోర్ట్స్ జిఎం మురళి లిఖిత పూర్వకంగా తమకు లేఖను రాసిచ్చారని తెలిపారు. వారం రోజుల గడువు కోరినట్లుగా, లేనియెడల లేబర్ ఆఫీస్ కి వచ్చి ఫిర్యాదు చేసి మళ్లీ మీ ఆందోళన కొనసాగించాలని మహిళ కార్మికులను శ్యాంసుందర్ కొరినట్లు తెలిపారు.

250 కిలో మీటర్లు రాకేష్ దత్త మహా పాదయాత్ర

సైఫాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త:

రాకేష్ దత్తను సత్కరిస్తున్న రాజేందర్

పెండింగ్‌లో ఉన్న 10 వేల కోట్ల ఫీజుల బకాయిలను ప్రభుత్వం వెంటన్ చెల్లించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ చెరుకుల రాజేందర్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడరాదని హెచ్చరించారు. తక్షణమే విడుదల చేయకపోతే ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నవంబరు 17వ తేదీ నుంచి ఖమ్మం నుంచి హైద రాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటి వరకు ఆ యూనివర్సిటి విద్యార్థి నాయకుడు రాకేష్ దత్త 250 కిలో మీటర్లు మహా పాదయాత్ర చేసి శుక్రవారం బిసి భవన్‌కు వచ్చిన సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రాకేష్ దత్తను, టిమ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు నారాయణ రావు, జి.బాలస్వామి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకలకు సర్కిల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలి

నార్సింగి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న క్రిస్మస్ కానుకలు పొందాలనుకునే వారు ఈ నెల 15.వ, తేదీలోపు స్థానిక సర్కిల్ కార్యాలయాలలో అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని డిసిలు కృష్ణమోహన్‌రెడ్డి, శరత్‌చంద్రలు పేర్కొన్నారు. క్రిస్మస్ సంబరాలకు రూ.లక్ష, చర్చి భవనానికి రంగులు వేసేందుకు రూ.20.వేలు, లైటింగ్‌కు రూ.10.వేలు ప్రభుత్వం ఆర్థిక సహాయం ఇవ్వనుందని వివరించారు. ఈ ప్రయోజనం పొందాలనుకునే వారు తమ చర్చీలకు సంబంధించిన రిజిస్ట్రర్ కాఫీలు పెట్టి దరఖాస్తు చేసుకోవాలని కమీషనర్లు సూచించారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

గోషామహల్,డిసెంబర్ 12 ప్రభాతవార్త:

చలికి తట్టుకోలేక ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సంఘటన గోషామహల్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది.ఎస్.ఐ అరవింద్‌గౌడ్ కథనం ప్రకారం...ముస్లింజంగ్‌పూల్‌లోని భగత్‌సింగ్ విగ్రహం సమీపంలో గత నెల 29వ తేదిన చలికి తట్టుకోలేక పడి ఉన్నాడు. పెట్రోలింగ్ డ్యూటిలో ఉన్న పోలీసు సిబ్బంది డి.బాబు,రాజేందర్‌రావులు గుర్తుతెలియని వ్యక్తి చికిత్సనిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు.చికిత్స పొందుతూ ఈనెల 9వ తేదిన మరణించినట్లు వైద్యులు దృవీకరించడంతో మృతదేహాన్ని మార్చురీలో ఎ.ఎస్.ఐ రామచారి భద్రపర్చినట్లు తెలిపారు.మృతదేహంపై నీలిరంగుషర్టు, నల్లప్యాంటు ఉందన్నారు.ఈ కేసును గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటు అడ్డుకోవడం సమంజసం కాదు

సైఫాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త: రవీంద్రభారతి ప్రాంగణంలో గాన గంధర్వుడు, పద్మ విభూషణ్ డా. ఎస్.పి.బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటును కొంత మంది తెలంగాణ వాదులు వ్యతిరేకించడాన్ని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు కుమార్‌చౌదరియాదవ్ తప్పుబట్టారు. బాలసుబ్రమణ్యం తెలుగు, హిందీ, కన్నడ తదితర భాషలకు సంబంధించిన అనేక పాటలు పాడి కోట్లాది మంది అభిమానుల హృదయాలలో నిలిచిపోయారని, ఆలాంటి మహానుభావుడు విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంటే ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అడ్డుకోవడం ధర్మం కాదన్నారు. ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవులు, కళాకారులు, రచయితలు, గాయకులు, జర్నలిస్టులకు కులాలు, మతాలు, ప్రాంతాలు, పశుపక్షాల బేధం ఉండవని స్పష్టం చేశారు. ప్రతి చిన్న విషయంలో ఆంధ్రవాడు గోబ్యాక్, మార్యాడివాడు గోబ్యాక్ అంటూ విమర్శలు చేస్తున్నారని, ఆదే ముస్లిం సోదరులను తురకోడా గోబ్యాక్ అనే దమ్ము, ధైర్యం వారికి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. తాము శాంతియుతంగా ఉంటున్నామని, ఇలా విమర్శిస్తూ పోతుంటే తాము చూస్తూ ఊరుకోనేది లేదని, ఇక సహించేది లేదని, గాజులు తోడుక్కొని లేమని ఆయన హెచ్చరించారు. వారు ఖాసీం రిజ్వీ వారసులా అని ఆయన నిలదీశారు. త్యాగాలు చేసిన వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఎవరైనా కోరవచ్చునని, కాని ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్న బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని వద్దని అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కావడంతో అన్ని ప్రాంతాల ప్రజలు ఇక్కడికి రావడం వల్లనే అభివృద్ధి చెందిందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి అయిన తరువాత ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సమితి నాయకులు కమలాకర్, ఆనంద్, అశోక్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ చౌదరియాదవ్

మహాదేవపురం డివిజన్(277)ను దేవేందర్‌నగర్ డివిజన్‌గా నామకరణం చేయాలి : మల్లేశ్

కుత్బుల్లాపూర్, డిసెంబరు 12 ప్రభాతవార్త

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో ఏర్పడ్డ 300 కార్పొరేషన్ డివిజన్‌లలో మహాదేవపురం డివిజన్‌గా ప్రకటించిన దానికి తక్షణం దేవేందర్‌నగర్ డివిజన్‌గా పేరుమార్చాలని దేవవేందర్‌నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు మల్లేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు దేవేందర్‌నగర్‌కు చెందిన బస్తీవాసులు పెద్దఎత్తున శుక్రవారం కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్‌ను, గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం ఏర్పడ్డ దేవేందర్‌నగర్‌ను కాదని కొత్తగా ఏర్పడ్డ మహాదేవపురం కాలనీని డివిజన్‌గా రూపొందించడం వల్ల దేవేందర్‌నగర్ ఉనికికే ప్రమాదం ఏర్పడ్డట్టవుతుందని వారు ఆందోళన వ్యక్తంచేశారు. దేవేందర్‌నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు మల్లేష్, సంధ్య, పూనమ్మ,సంక్షేమసంఘ ప్రతినిధులు విఠల్,బాస్కర్, అంబదాస్, హానుమంతు, సూర్యలతోపాటు స్థానికులు పెద్దఎత్తున తరలివెళ్లి కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు, గాజుల రామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డిలకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా సంక్షేమ సంఘ అధ్యక్షులు మల్లేశ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ డివిజన్ మహాదేవపురం 277నుతక్షణం దేవేందర్‌నగర్ డివిజన్‌గా మార్చాలని కోరారు.లేదంటే యావత్ బస్తీవాసులు పెద్దఎత్తున జిహెచ్ఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దేవేందరనగర్ ఏర్పడ్డతరువాతే స్థానికంగా సిమెంట్‌రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయని, దేవేందర్‌నగర్‌కు మండల రెవెన్యూ కార్యాలయం సైతం తరలివచ్చిందని మల్లేష్ తెలిపారు.

కుత్బుల్లాపూర్ ఎంఎల్ఏ కె.పి.వివేకానంద్‌ను కలిసి దేవేందర్‌నగర్ డివిజన్‌గా మార్చాలని కోరుతూ వినతిపత్రం సమర్పిస్తున్న దేవేందర్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు మల్లేశ్ ,బస్తీవాసులు

లలిత సంగీతరత్న విన్నకోట మురళి కృష్ణకు ఘంటసాల అవార్డు

చిక్కడపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త : ఆనాటి ప్రముఖ భావ కవులు రాసిన పలు లలిత గీతాలకు స్వర కల్పన చేసి వర్ధమాన, ఔత్సాహిక గాయనీ గాయకుల చేత పలు లలిత సంగీత విభావరులలో పాడించిన విన్నకోట మురళీకృష్ణ లలిత సంగీత దర్శకుడుగా మంచి పేరు గడించారని వంశీ సంస్థ ల రథసారథి కళారత్న, శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు అన్నారు. ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ (ఇండియా) ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103 వ జయంతి సందర్భంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో జరిగింది. ప్రముఖ లలిత సంగీత దర్శకుడు, లలిత సంగీత రత్న విన్నకోట మురళీ కృష్ణ కు ఘంటసాల ఆవార్డు ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ఆ రోజుల్లో తమ వంశీ సంస్థ నిర్వహించిన పలు లలిత సంగీత విభావరులు విన్నకోట మురళీ కృష్ణ సంగీత దర్శకత్వంలో విస్తృతంగా జరిగాయని గుర్తు చేశారు. లలిత సంగీతం వ్యాప్తి చెందడానికి మురళీకృష్ణ చాలా కృషి చేశారని ఆయన అన్నారు. ఘంటసాల అవార్డు గ్రహీత మురళీ కృష్ణ మాట్లాడుతూ లలిత సంగీతం తనకు ప్రాణమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెలిగించవే చిన్ని వలపు దీపం పేరుతో వి.ఆర్.కె.ఫణి నిర్వహణలో స్వర్గీయ తెన్నేటి సుధాదేవికి ఘంటసాల పాటల స్వరానివాళి జరిగింది. నిర్వాహక మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గాయని గాయకులూ జె ఏ.శాస్త్రి , ఆర్. శ్రీధర్, టివి.రావు, టి.లలితరావు, నిషిజా రమణి, సవిత రవికుమార్, స్వర కళ్యాణి అద్భుతంగా గానం చేయగా ప్రాషికేష్ కారవోకే సహకారాన్ని అందించారు.

లలిత సంగీతరత్న విన్నకోట మురళి కృష్ణ కు ఘంటసాల అవార్డు ప్రధానం చేసిన దృశ్యం

ఇంటి వెనుక తాళాలు పగలగొట్టి చోరీ

-రూ. 45 లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలు, 4 కిలోల వెండి చోరీ

మలక్ పేట, డిసెంబర్ 12, ప్రభాతవార్త:

కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక తాళాలు పగలగొట్టి రూ 45 లక్షల నగదు, 15 తులాల బంగారు బిస్కెట్లు, ఆభరణాలు, 4 కిలోల వెండిని దొంగలించక పోయిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మలక్ పేట ప్రొఫెసర్స్ కాలనీలోని మానస అపార్ట్మెంట్స్ ఫ్లాట్ నెంబర్ 102 లో మంత్రవాది వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. కాగా గత నెల 13వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్ర కోసం తమిళనాడు, కేరళ, గోవాకు వెళ్లారు తిరిగి ఈనెల బుధవారం రాత్రి మలక్ పేట ప్రొఫెసర్స్ కాలనీలోని తన ఫ్లాట్ కు రావడం జరిగింది. ఇంటి తాళాలు తెరిచి లోపలికి వెళ్లి చూడగా ఇంటి వెనుక వైపు బాల్కనీ తలుపులు పగలగొట్టి కనిపించాయి. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు గదిలోని బీరువా వద్దకు వెళ్లి చూడగా అది కూడా పగలగొట్టబడి ఉంది. అనుమారా లో ఉన్న రూ. 45 లక్షల నగదు, పది తులాల బంగారు బిస్కెట్లు (ఒకటి ఏడు తులాల బంగారు బిస్కెట్, మరొకటి మూడు తులాల బంగారు బిస్కెట్), రెండు తులాల బంగారు గాజులు, మూడు తులాల బంగారు నాణాలు, 4 కిలోల వెండి చోరీకి గురవడంతో బాధితుడు మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో మలక్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీమ్స్ బృందాలను రప్పించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. సంఘటన ప్రాంతాన్ని మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్, డిఐ జయశంకర్‌లు తమ సిబ్బందితో కలిసి సందర్శించి వివరాలను సేకరించారు. నేపాల్ కు చెందిన వాచ్ మెన్ పై అనుమా నం కాగా అపార్ట్మెంట్స్‌లో నేపాల్ చెందిన అర్జున్ అనే వ్యక్తి కొంత కాలం నుంచి వాచ్మెన్ గా పనిచేస్తున్నాడని, ఉన్నట్టుండి చెప్పా పెట్టకుండా ఉద్యోగాన్ని మానేసి వెళ్లిపోవడంతో అతని ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని బాధితుడు వెంకటరమణ అనుమానాలు వ్యక్తం చేశారు.

వ్యాపారం పేరుతో కోటికి పైగా ఎగనామం

-న్యాయం చేయాలంటూ బాధితుడు రామకృష్ణ ఆవేదన

హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:

తన దగ్గర ఒక సంవత్సరం నుండి మొక్కజొన్న ముప్పై లారీల లోడ్ తీసుకొని, ఒక కోటి ఏనభై తొమ్మిది లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, సెటిల్ మెంట్ పేరుతో రెండు నెలల క్రితం ఆరామ్ ఘర్ లోని వారి ఇంటికి పిలిచి ముగ్గురు సోదరులు డబ్బులు ఇవ్వకుండా చివరికి తనపైనే అక్రమాలకు, బెదిరింపులకు దిగుతున్నారని న్యాయం చెయ్యాలని బాధితుడు రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం లోని చిక్ బళ్లాపూర్ పెరే సంద్రం లో తాను మొక్కజొన్న వ్యాపారం చేస్తానని, రైతుల నుండి కొనుగోలు చేసి హైదరాబాద్ ఆరామ్ ఘర్ కు చెందిన ముగ్గురు సోదరులు అక్బర్, నాసిర్, అహ్మద్‌లకు చెందిన రెండు కంపెనీ లకు విక్రయిస్తానని తెలిపారు. ఐతే తొమ్మిది లారీల మొక్కజొన్న లోడ్ ను తాను పంపాక తనకు చెల్లించాల్సిన నగదులో ఒక కోటి ఎనభై తొమ్మిది లక్షల రూపాయలు ఇంకా ఇవ్వాల్సి ఉందని, ఆ సొమ్మును చెల్లించమని అడిగితే, ఆరామ్ ఘర్ లోని తన ఇంటికి వచ్చి డబ్బులు సెటిల్మెంట్ చేసుకోవాలని పిలిపించుకున్న పిదప, తనకు డబ్బులు ఇవ్వాల్సింది పోయి తన పైనే కేసులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చాలా మంది రైతుల వద్ద నుండి సేకరించిన మొక్కజొన్న లోడ్ లకు సంబందించి వారికి నగదు చెల్లించాల్సి ఉందని, తన లోడ్ కొనుకున్న ఈ సోదరులు డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని, తాను ఇప్పటి వరకు ఎన్ని పోలీస్ స్టేషన్లు తిరిగినా తనకు న్యాయం జరగట్లేదని ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తనకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

నిమ్స్‌లో కొనసాగుతున్న నర్సింగ్ ఉద్యోగుల శాంతియుత ఆందోళన

జూబ్లీహిల్స్, డిసెంబరు 12, ప్రభాతవార్తః

శాంతియుత ఆందోళనలో నిమ్స్ ఆసుపత్రి నర్సులు

నిమ్స్ ఆసుపత్రిలో నర్సింగ్ ఉద్యోగుల శాంతియుత ఆందోళన కొన సాగుతుంది. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుంచి నర్సింగ్ ఉద్యోగులు శాంతియుత ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ప్రతి రోజు ఏదో ఒక సమయంలో వారు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే వారి దీర్ఘకాలిక డిమాండ్‌లలో ఒకటైన నర్సింగ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నిమ్స్‌లో ఉచిత చికిత్స అందించేందుకు అవసరమైన వివరాలను అందించాలంటూ డైరక్టర్ రెండు రోజుల క్రితం సర్క్యులర్ జారీ చేశారు. కాగా తమ ఆందోళనను విరమించేది లేదని, తమ డిమాండ్లన్నింటిని పరిష్కరించాలని మరోవైపు నర్సింగ్ యూనియన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. అప్పటివరకు తమ శాంతియుత ఆందోళన కొనసాగుతుందని నర్సింగ్ యూనియన్ అధ్యక్షురాలు ఆశలత తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు.

గందరగోళంగా మారిన గోషామహల్ డివిజన్‌ను సరి చేయాలి

గోషామహల్,డిసెంబర్ 12ప్రభాతవార్త:

గోషామహల్ డివిజన్‌ను గందర గోళంగా మార్చిన జిహెచ్ఎంసి అధికారులని గోషామహల్ నియోజకవర్గం బిజెపి సీనియర్ నాయకులు డి.గోపాల్‌జీఆరోపించారు.జిహెచ్ఎంసి ప్రక్షాళన పేరుతో ఇష్టానుసారంగా సరిహద్దులను కలిపి గందరగోళానికి గురిచేశారని పలువురు ఆరోపిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటిలను గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలకసంస్థలో వీలినం చేస్తున్నట్లు జి.ఓ జారీచేసి ప్రజలు,పార్టీ నాయకుల అభిప్రాయాలను తీసుకోకుండా ఇష్టాను సారంగా డివిజన్‌లను అయోమయంగా మార్చివేసినట్లు దుయ్యబట్టారు.గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహానగరపాలక సంస్థ కమీషనర్,డిప్యూటి మున్సిపల్ కమీషనర్లను కలిసి వినతిపత్రాలను అందచేశారు. గోషామహల్ మున్సిపల్ డివిజన్‌లో 65వేల ఓటర్లను చేర్చి, కొత్తగా రూపొందించినఎన్జిబిషన్‌గ్రౌండ్స్ డివిజన్‌లో 25వేల ఓటర్లను చేర్చడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. నియమనిబంధనల ప్రకారం ప్రతి డివిజన్‌ను 40వేలకు మించి ఉండవద్దని అధికారులే అంటున్నారు.ఇలా ఒక డివిజన్‌లో 65వేలు,మరోడివిజన్‌లో 25వేల ఓటర్లను ఎలా చేర్చుతారని ప్రశ్నించారు.అధికారులు ఇప్పటికైనా గోషామహల్ డివిజన్‌లోని 14-1వార్డు,14-2,14-4,5-3,5-4 వార్డులను జైన్ మందిరం,రాణా ప్రతాప్‌కమ్యూనిటిహాల్, చందన్‌వాడి, జ్ఞాన్‌బాగ్ కాలనీ,పాన్‌మండి, జోషివాడి,ఆర్యసమాజ్, లక్ష్మినారాయణ బాగ్,హజారిభవన్ గోషామహల్ డివిజన్ చేర్చాలనిడిమాండ్ చేశారు.ఏకంగా వార్డుల మధ్య ఓటర్ల సంఖ్యలో గణనీయమైన వ్యత్యాసం ఉందన్నారు.లేనిపక్షంలోగోషామహల్ ప్రజలతో కలసి ఆందోళన చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గోషామహల్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డిప్యూటి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

క్రమశిక్షణతోనే విద్యార్థుల సరైన గమనం

- అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి

జూబ్లీహిల్స్, డిసెంబరు 12, ప్రభాతవార్తః

క్రమశిక్షణతోనే విద్యార్థులు సరైన గమనంలో ముందుకు వెళ్తారని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, మాజీ టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శుక్రవారం వార్షిక క్రీడోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సింక్రోనీ-వన్ అవర్, వన్ టీమ్-వన్ స్పిరిట్ థీమ్‌తో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఏకతా, సహకారం, సమన్వయాన్ని అద్భుతంగా ప్రతిబింబించారు. ఈ సందర్భంగా ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. భవన్స్ విద్యా సంస్థ విలువలతో పాటు సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని సమ్మిళితం చేస్తూ క్రీడలను పాఠ్య కార్యక్రమంలో భాగం చేస్తుందని, తద్వారా క్రమశిక్షణతో కూడిన విద్యావంతులుగా తీర్చిదిద్దుతుందన్నారు. స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎస్. గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ 50 శాతం సమయాన్ని మైదానంలో గడపాలని, దీనివల్ల శారీరక దారుఢ్యంతో పాటు జీవిత నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. విద్య విద్యార్థుల శారీరక, మానసిక, మానవీయ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత నాయర్ పాఠశాల సాధించిన విజయాలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథి పాఠశాల జెండా ఎగురవేసి, క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఫిట్ ఇండియా థీమ్‌తో నిర్వహించిన డ్రిల్లులు, ప్రదర్శనలు, క్రమశిక్షణ, అందరిని ఆకట్టుకున్నాయి. యూనిటీ ఇన్ మోషన్, స్ట్రెంగ్త్ ఇన్ రిథమ్ వంటి భావాలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ట్రాక్ ఈవెంట్స్, రిలేలు, ఫీల్డ్ పోటీల్లో వివిధ హౌస్‌ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో భవన్స్ హైదరాబాద్ కేంద్ర కో-ఆర్డినేషన్ రమాదేవి, హెడ్ గర్ల్ రితిషారెడ్డి పాల్గొన్నారు.

క్రీడా వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆచార్య ఘంటా చక్రపాణి, గోపాలకృష్ణన్, శ్రీలతానాయర్, రమాదేవి తదితరులు.

అయ్యప్ప నామస్మరణంతో మారుమ్రోగిన నెమలీనగర్

పుప్పాలగూడ నెమలీనగర్‌లో జరిగిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు.

నార్సింగి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామం నెమలీనగర్‌లో శుక్రవారం కలియుగ ప్రత్యక్ష దైవమైన హరిహర తనయుడు శ్రీ అయ్యప్ప స్వామి నామ స్మరణంతో మారుమ్రోగిపోయింది. అయ్యప్ప స్వామి పడిపూజ ఉదయం 9.గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గ్రామం అంతా అయ్యప్

నేడు నగరానికి లియోనెల్ మెస్సీ

-పుట్‌బాల్ ఈవెంట్‌కు కట్టుదిట్టమైన భద్రత
-450 సీసీ కెమేరాలు, డ్రోన్లతో స్టేడియంలో నిఘా
-మెస్సీకి జడ్ కేటగిరీ భద్రత
-పాస్‌లున్న వారికే స్టేడియంలో ప్రవేశం

హైదరాబాద్ డిసెంబరు 12 ప్రభాతవార్త: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో ఉప్పల్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడనున్నారు. దీంతో నగరం ఆ క్షణాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హైదరాబాద్ పర్యటనకు రానున్న మెస్సీ షెడ్యూల్ ప్రకారం..శనివారం మధ్యాహ్నం 3 నుండి 4 గంటల మధ్య కోల్‌కత్తా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. అక్కడ నుండి నేరుగా తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లనున్నారు. అక్కడ గంటపాటు అభిమానులతో ప్రత్యేకమైన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెస్సీతో ఫోటో దిగేందుకు 10 లక్షల రూపాయలు చెల్లించి ముందుగానే స్లాట్లు బుక్ చేసుకున్న 100 మంది అదృష్టవంతులతో స్టార్ ప్లేయర్ ముఖాముఖీగా మాట్లాడి, ఫోటోలు దిగనున్నాడు.ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు మెస్సీ ఉప్పల్ స్టేడియంకు చేరుకుంటారు. అక్కడ చిన్నారుల ఫుట్‌బాల్ జట్టుతో 15 నిమిషాల పాటు సంభాషించి, కొన్ని మెళకువలు తెలపనున్నాడు. ఆపై సాయంత్రం 7 గంటలకు ప్రధాన ఈవెంట్ ప్రారంభం కానుంది. 7.30కి ప్రత్యేక మ్యాచ్ జరుగనుంది. సింగరేణి జట్టుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం వహిస్తుండగా.. అపర్ణ మెస్సీ టీమ్ తరఫున మెస్సీ ఆడనున్నారు. మెస్సీతో పాటు అతని స్నేహితులైన రోడ్రిగో, లూయిస్ సురేజ్ కూడా ఈ మ్యాచ్‌లో పాల్గొనబోతున్నారు.

అయితే మ్యాచ్ చివరి ఐదు నిమిషాల్లో మాత్రమే మెస్సీ, సీఎం రేవంత్ రెడ్డి గ్రౌండ్‌లోకి ప్రవేశించి ఆడనున్నారు. మ్యాచ్ అనంతరం విజేత జట్టుకు ట్రోఫీని మెస్సీ, రేవంత్‌రెడ్డి కలిసి ప్రధానం చేయనున్నారు. ఈవెంట్ ముగిసిన తర్వాత మెస్సీ తిరిగి ఫలక్‌నుమాకు వెళ్లి అక్కడే రాత్రి బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం ముంబైకి పయనమవుతారు. మొత్తంగా నగరవాసులకు, ఫుట్‌బాల్ లవర్స్‌కు పండుగగా నిలువనుంది.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు...

ఉప్పల్ స్టేడియంలో శనివారం జరగబోయే అంతర్జాతీయ ఫుట్బాల్ ఈవెంట్ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. మెస్సీకి జట్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని, ఆయన్ని గ్రీన్ ఛానల్ ద్వారా స్టేడియంకు తీసుకువస్తామని సీపీ తెలిపారు. అయితే, వాహనంలో ఉన్నప్పుడు కూడా మెస్సీని చూసే అవకాశం ప్రేక్షకులకు ఉండదని, కాబట్టి అనవసరంగా రోడ్డుపైకి వచ్చి చూసే ప్రయత్నం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.స్టేడియం సామర్థ్యం 39 వేలు అని, దానికి తగ్గట్టుగానే నిర్వాహకులు పాస్‌లు అమ్ముతున్నారని, అయితే స్టేడియం దగ్గర ఎలాంటి పాస్‌లు అమ్మబడవని, కేవలం ఆన్‌లైన్ లోనే పాసులు అమ్మబడతాయని క్లారిటీ ఇచ్చారు. పాసులు ఉన్నవారు మాత్రమే రావాలని, లేనివారు స్టేడియం వద్దకు రావద్దని స్పష్టం చేశారు సీపీ. భద్రత కోసం స్టేడియం పరిసరాల్లో 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మోస్ట్ అడ్వాన్స్డ్ డ్రోన్లతో కూడా నిఘా పెడుతున్నట్లు చెప్పారు.శనివారం సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుందని, సాయంత్రం 4 గంటల నుంచే ప్రేక్షకులను లోపలికి అనుమతిస్తామని సీపీ పేర్కొన్నారు.

మెస్సీ కొద్దిసేపు మాత్రమే ఆడతారు కాబట్టి, ప్రేక్షకులు ముందస్తుగానే స్టేడియం చేరుకోవాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ల్యాప్ టాప్‌లు, బ్యానర్లు, వాటర్ బాటిళ్లు, కెమెరాలు, సిగరెట్లు, గొడుగులు, లైటర్లు, బైనాకులర్లు, బ్యాటరీలు, హెల్మెట్, బ్యాగ్ వంటి వస్తువులకు స్టేడియం లోపలికి అనుమతి లేదని, కేవలం మొబైల్ ఫోన్లను మాత్రమే అనుమతిస్తున్నట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు.

నిరుద్యోగ జాబ్ మేళాకు విశేష స్పందన

2,100 మందికి ఉద్యోగ అవకాశాలు

ముషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త: ప్రముఖ సంఘ సేవకులు టి.దినకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ జాబ్ మేళా కు వేలాది మంది నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన వచ్చింది. ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ప్యాలెస్‌లో నిర్వహించిన ఈ మేళాలో 195 కంపెనీలు పాల్గొనగా, 5,200 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,010 మందికి ఉద్యోగ అవకాశా లు కల్పిస్తూ నియామక పత్రాలు అందచేశారు. అనంతరం దినక ర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల లక్షలాదిమంది చదువుకున్న యువత ఇబ్బందులు పడుతు న్నారని, వారికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ఐటీ కంపెనీలు, ప్రైవేట్ ఆసుప త్రుల యాజమాన్యాలు, ఇతర ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలతో మాట్లాడి, ఈ జాబ్ మేళా ఏర్పాటుచేయటం జరిగిందని తెలిపారు. రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పించటం ఎంతో ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు నిర్వ హించి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తా నని తెలిపారు.

రెవెన్యూశాఖామంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

ముషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త: రెవెన్యూ మంత్రి కుమారుడికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేసిన అరాచకంకు బాధ్యత వహిస్తూ రెవెన్యూశాఖా మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయి బాబా డిమాండ్ చేశారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశం లో ఆయన మాట్లా డుతూ రంగారెడ్డిజిల్లాలోని గండిపేట మండల పరిధి లో అత్యంత విలువైన భూమని డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కోసం రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ తీవ్రంగా వత్తిడి చేసినా, స్వయంగా రెవెన్యూ మంత్రి రంగంలోకి దిగి బెదిరించినా, భూయజమాని వినకపోవటంతో మంత్రి కుమారుడు భూయజమాని ఇంటికి వెళ్లి, దౌర్జన్యానికి పాల్ప డటం దారుణ మన్నారు. భూయజమాని న్యాయం కోసం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా కూడా దౌర్జన్యానికి పాల్పడటం చట్టాన్ని అపహాస్యం చేయటమేనని, ఈ విధంగా మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని, అధికార దుర్వినియోగానికి పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. భూదందాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న రెవెన్యూ మంత్రిని తక్షణమే కేబినేట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ-వ్యర్థం.. అనర్థం

-రీ సైక్లింగ్ పై అవగాహన లేమితో జల, వాయు, నేల కలుషితం

హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త మహానగరానికి ఎలక్ట్రానిక్ వ్యర్థాల ముప్పు పెరుగుతోంది. ఏటా వ్యర్థాలు పోగుపడుతుంటే రీసైక్లింగ్‌లో సరైన విధానాలు అవలంబించక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాడి పారేస్తున్న సెల్ ఫోన్లు, టీవీలు, విద్యుత్తు పరికరాలు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడంలో పీసీబీ, మున్సిపల్, ఇతర విభాగాల అలసత్వం, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో కాలుష్యం పెరిగిపోతోంది. పారేసిన బ్యాటరీ ఓ జలాశయాన్ని కలుషితం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సింహభాగం నగరం నుంచే..

ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతోంది. తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నులను దాటి ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా తర్వాత దేశంలో మూడో అతిపెద్ద వ్యర్థాల ఉత్పత్తిదారుగా రాష్ట్రం నిలిచిందని లోక్‌సభలో పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం నాటికి 1.19లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని వెల్లడించింది. ఈ వ్యర్థాలన్నీ ఐటీ రంగానికి కేంద్రంగా ఉన్న రాజధాని నుంచే ఉత్పత్తి అవుతున్నాయి.

20శాతంలోపే..

వ్యర్థాల రీసైక్లింగ్ కోసం కాలుష్య నియంత్రణ మండలి 31 సంస్థలకు అనుమతులివ్వగా అందులో 20కి పైగా రాజధాని పరిధి లో నే ఉన్నాయి. వీటికి ఏటా 2.25 లక్షల

టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే సామర్థం ఉంది. అయి నా 40వేల మెట్రిక్ టన్నులకు మించి రీసైక్లింగ్ చేయడం లేదు. పీసీబీ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2023-24లో ఎక్స్టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్)లో భాగంగా 63,635 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరించారు. ప్రాసెస్ చేసిన ఈ వ్యర్థాల్లో బంగారం, రాగి, అల్యూమినియం, ఇనుము, వంటి లోహాలు 24,497 మెట్రిక్ టన్నులుం డగా ఇతర వ్యర్థాలు 24,433 మెట్రిక్ టన్ను లున్నాయని పేర్కొంది.

కాలుష్యంతో సమస్యలిలా..

ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వంటి విషపూరిత పదార్థాలుంటాయి. వీటిని రీసైకిల్ చేయకపోతే నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. సీసం నీటి వనరుల్లో కలిస్తే నీటి కాలుష్యానికి దారి తీయడంతో పాటు జలచరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తాయి. ఈ రసాయ నాలు నేలలో చేరి దాని సారాన్ని దెబ్బ తీస్తాయి. వీటిని కాల్చడం, అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైకిల్ చేయడం వల్ల డైఆక్సిన్లు, ఫ్యూరాన్లు వంటి విష పూరిత వాయువులు విడుదలై గాలిని కలుషితం చేస్తాయి. దీంతో క్యాన్సర్, నాడీ వ్యవస్థ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు దారితీస్తాయి.

జిహెచ్ఎంసికి నీటి కొరత..

-ప్రధాన కార్యాలయంలో వాటర్ ట్యాంకర్లపైనే ఆధారం
-ప్రైవేట్ నుంచి రోజుకు 20 నుంచి 30 ట్యాంకర్లు
-మెయింటనెన్స్ విభాగంపై తీరుపై సర్వత్రా విమర్శలు

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయానికి క్యూకట్టిన ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్

హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త: జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నీటి సమస్య కొనసాగుతుంది. గత మూడు రోజులుగా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల పైనే ఆధాడి రోజుకు 20 నుంచి 30 ట్యాంకర్ల నీరు తెప్పిస్తున్నారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ కి వచ్చే పైప్ లైన్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకనే సరఫరా ఆగిపోయినట్లు అధికారులు గుర్తించారు. ప్రధాన కార్యాలయంలో నీటి సరఫరాతో గత మూడురోజులుగా ఇబ్బంది పడుతున్నారు. జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏడు ఫ్లోర్ల లో కలిసి 95 బాత్ రూమ్స్ ఉండటంతో ప్రైవేట్ ట్యాకర్ల నీరు కూడా సరిపోని పరిస్తితి నెలకొంది. కావున ఉన్నతాధికారులు పట్టించుకుని వెంటనే నీటి సమస్య తీర్చాలని సిబ్బంది కోరుతున్నారు. అయితే వాటర్ బోర్డు ట్యాంకర్లు బుక్ చేస్తే లేట్ అవుతుందని... ప్రైవేట్ ట్యాంకర్లు బుక్ చేస్తున్నామని జీహెచ్ ఎంసీ మెయింటెనెన్స్ అధికారులు చెబుతున్నారు.అలాగే వాటర్ బోర్డు అధికారులు సైతం ట్యాంకర్లు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని కానీ ఇప్పట కీ మమ్మల్ని సంప్రదించలేదని చెబుతున్నారు. అలాగే ప్రైవేట్ ట్యాంకర్ల కు నగరంలో అనుమతే లేదని... జీహెచ్ఎంసీ అధికారులు జలమండలి కాదని ప్రైవేట్ ట్యాంకర్లు బుక్ చేసి డబ్బులు వృధా అని డబుల్ రేట్ తో వాటర్ ట్యాంకర్లు బుక్ చేయడం వెనక అంతర్యమేమిటో తెలియడం లేదని తెలుపుతున్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి

-గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

ఉచిత సహాయ కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

సికింద్రాబాద్, డిసెంబర్ 12 ప్రభాతవాం యూనివర్సల్ పెల్ట్ కవరేజ్ డేను పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపు మేరకు గాంధీ ఆస్పత్రిలో లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత సహాయ, సేవా కార్యక్రమాలు శుక్రవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య అవసరాలకు సంబంధించిన అనేక సూచనలు ఎల్లపుడు అందించడానికి కృషి చేస్తామని, సరియైన వైద్యం రోగి యొక్క హక్కు అని తెలిపారు. తమ వైద్యుల బృందం ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రోగి ఆరోగ్యం కాపాడటానికి చేయవలసిన చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నాణ్యమైన వైద్య సేవలను సిబ్బంది ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం లీగల్ సెల్ లాయర్ జగదాంబ మాట్లాడుతూ డాక్టర్స్ యొక్క కృషిని కొనియాడారు. ప్రతి రోగికి చికిత్స చేసుకునే హక్కు ఉందన్నారు. ప్రతి వైద్య పరీక్ష, రక్త పరీక్షలు వంటి వివరాలు సంబంధిత వైద్య సిబ్బంది ద్వారా అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరికి ఉచితంగా అన్ని ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం అవుట్ పేషంట్ విభాగంలో గర్భిణీ స్త్రీలకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యంఓ డాక్టర్ శేషాద్రి, డాక్టర్ యోగి, డాక్టర్ నవీన్ , పారా లీగల్ వాలంటీర్ ఈశ్వరమ్మ , నర్సింగ్ ఆఫీసర్ మణి స్టాఫ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ వార్డుల విభజనపై ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ వార్డుల డిలిమిటేషన్‌పై వచ్చే ఫిర్యాదులను సెలవుదినాలైన ఈ నెల 13, 14 వ తేదీన కూడా స్వీకరించనున్నట్లు జీహెచ్ఎంసీ ప్రకటించింది. ఈ నెల 13,14 తేదీలలో కూడా ఫిర్యాదులను స్వీకరించేందుకు కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు జిహెచ్ఎంసి అధికారులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తమ అభ్యంతరాలు, సూచనలు సమర్పించుకునే వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

జిహెచ్ఎంసి వార్డుల విభజన తప్పుల తడక : నవతారెడ్డి

వార్డుల విభజనపై అభ్యంతరం వ్యక్తం చేసిన బిఆర్ఎస్ నేతలు

వార్డుల విభజనపై జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు

శేరిలింగంపల్లి,డిసెంబర్ 12 ప్రభాతవార్త జీహెచ్ఎంసీలో నూతనంగా జరిగిన వార్డుల విభజనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి అనుకూలంగా విచ్చలవడిగా డివిజన్లను ఏర్పాటు చేసి వార్డుల విభజనను తప్పుల తడకగా మార్చారంటూ బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడుతున్నారు. డివిజన్ మాప్‌లు అందుబాటులో లేకుండా త్వరితగతిన అభ్యరంతరాలు తెలియజేయాలనే అధికారుల నిర్ణయంపై ప్రతిపక్షపార్టీల నేతలు తప్పుబడుతున్నారు. నేషనల్ హైవేలను విడిచిపెట్టిన చిన్నచిన్న మురికికాలువలను హద్దులుగా నిర్ణయించటం,ఒకే కాలనీని రెండు డివిజన్లుగా చీల్చటం,కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు మాత్రమే డివిజన్ మాప్‌లను అందుబాటులోకి ఉంచుతూ ప్రతిపక్షపార్టీలకు ఏలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై శేరిలింగంపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల విభజనంతా లోపభూయిష్టమే..

నగర విస్తరణలో భాగంగా జీహెచ్ఎంసీ డివిజన్లను 150 నుంచి 300వరకు పెంచటం జరిగింది. కాగా పెరిగిన డివిజన్లను శాస్త్రీయంగా విభజించలేదంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఒక డివిజన్‌లో 25వేల నుంచి 30వేల ఓటర్లు ఉండాల్సి ఉండగా ఒక డివిజన్‌ను పెద్దగా , ఒక డివిజన్‌ను చిన్నగా తప్పుల తడకగా ఏర్పాటు చేయటమేమిటని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వెస్ట్‌జోన్ కమిషనర్ హేమంత్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నేతలు బొబ్బ నవతారెడ్డి, హరీశ్,రోజా, శ్రీనివాస్,రామకృష్ణ , అనంతరెడ్డి తదితరులు తమ ఫిర్యాదులను అందజేశారు.

తప్పులను సవరించండి:మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గతంలో ఉన్న ఏడు డివిజన్లకు గాను ప్రస్తుతం 18 డివిజన్లగా మారాయని, డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉందని, అధికారులు లోపాలను సవరించాలని శేరిలింగంపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ నేత, చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ వార్డు విభజన పై ప్రజల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని అంటున్నారే కాని ప్రజలకు డివిజన్ మాప్‌లను అందించకపోవడంపై అధికారుల వైఖరి అర్థం కావడంలేదన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆమె వాపోయారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తాం

- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



సీబీఎన్‌నగర్‌లో బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

తార్నాక, డిసెంబర్ 12 ప్రభాతవార్త : హైదరాబాద్ నగరంలో ఎక్కడ చూసినా స్థానిక సమస్యలే ఉన్నాయని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన జనం బాట కార్యక్రమంలో భాగంగా మూడో రోజు సికింద్రాబాద్ నియోజక వర్గంలోని మాణిశ్వరీనగర్ బస్తీ, ఆర్టీసీ ఆస్పిటల్, చంద్రబాబునాయుడు నగర్ బస్తీలల్లో కల్వకుంట్ల కవిత నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ఆమె ఎంతో ఓపికతో విని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామినిచ్చారు. ఈ ప్రభుత్వానికి పేదల పట్ల కనికరం లేదన్నారు.

చంద్రబాబునాయుడు నగర్‌లో పేదల ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు: కవిత

సికింద్రాబాద్ నియోజక వర్గంలో ఎన్నో ఏండ్లుగా స్థానిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సీబీఎన్‌నగర్ బస్తీలో ఇండ్లపై కప్పులు ప్రజల మీదపడుతున్నా అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మాణికేశ్వరీనగర్ బస్తీలో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. ఈ బస్తీకి ఉస్మానియా యూనివర్సిటీకి తల్లి కొడుకు లాంటి భంధం ఉందని అలాంటి బందాన్ని జీఎహెచ్ఎంసీ వార్డుల విభజన పేరుతో ఎలా వేరు చేస్తారని ప్రశ్నించారు. బస్తీని ఒ..యూతో విడదీస్తే ఊరికోమన్నారు. అనంతరం తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి వద్ద యూనియన్ నాయకులతో ఆమె మాట్లాడారు.అనంతరం సీబీఎన్‌నగర్ బస్తీ సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్ యాదవ్‌తో ఆమె మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇండ్ల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ ఆలకుంట సరస్వతి, నాయకులు ఆలకుంట హరి, వేముల మల్లేష్, సత్యనారాయణ, గంగపుత్ర, కళ్యాణ్, జగన్, వేముల కిట్టు, బండారు మహేందర్ ముదిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టికం

- ఒకటో తరగతి విద్యార్థికి 8చోట్ల అట్లకాడ వాతలు
- ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

చిన్నారికి అయిన అట్లకాడ వాతల గాయాలు

ఫిల్మ్‌నగర్, డిసెంబరు 11, ప్రభాతవార్త: ఓ చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టికానికి పాల్పడింది. అట్లకాడతో వాతలు పెట్టడంతో చిన్నారికి గాయలయ్యాయి. ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసులు, చిన్నారి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా పెద్దపూడి మండలం గణపతి నగర్‌కు చెందిన వల్లు సత్తిబాబు తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నాలుగేళ్లుగా ఓయూ కాలనీలోని రిలయన్స్ అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. కాగా ఆయన ఇద్దరు పిల్లలన ప్రతి రోజు సాయంత్రం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన శ్రీమానస వద్దకు గత మూడు నెలలుగా ట్యూషన్‌కు పంపుతున్నారు. గురువారం ఇద్దరు పిల్లలు ట్యూషన్‌కు వెళ్లి పెద్దకుమారుడు ఇంటికి తిరిగిరాగా చిన్నకుమారుడైన ఒకటో తరగతి చదువుతున్న వల్లు తేజ్ నందన్(7) ఇంటికి రాలేదు. దీంతో ట్యూషన్ టీచర్‌కు ఫోన్ చేయగా ఇంటికి వచ్చి తీసుకెళ్లాలని సూచించింది. దీంతో ట్యూషన్ వద్దకు వెళ్లగా తేజనందన్ కాళ్లు, చేతులు, తొడలు, ముఖంపై గాయల య్యాయి. అట్లకాడతో కాల్చి వాతలు పెట్టినట్లు కుమారుడు తల్లిదండ్రులకు తెలిపాడు. ఇదే విష యమై ట్యూషన్ టీచర్‌ను నిలదీయగా ఇష్టమున్న చోట చెప్పుకోవాలంటూ బెదిరించింది. ఈ నేపథ్యంలో చిన్నారి తండ్రి ఫిల్మ్‌నగర్ పోలీసుల కు ఫిర్యాదు చేశారు. దాదాపు 8చోట్ల అట్లకాడతో ట్యూషన్ టీచర్ వాతలు పెట్టిగాయాలు చేసిందని సత్తిబాబు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయాల పాలైన చిన్నారిని పోలీసులు గొల్కొండ ఏరియా ఆసుపత్రికి తర లించారు. గాయాల వల్ల తమ కుమారుడు నడవలే కపోతున్నాడని, తన కుమారుడిపై దాష్టికానికి పాల్పడిన ట్యూషన్ టీచర్‌పై చట్టరిత్య చర్యలు తీసుకో వాలని ఫిర్యా దులో కోరారు. ఈ మేరకు పోలీసులు ట్యూషన్ టీచర్‌పై కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు. చెప్పిన మాట వినకపోవ డం వల్లనే వాతలు పెట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న అధికారులు

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

సిర్గాపూర్, డిసెంబరు 12, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ఆఫ్ ట్రైనర్ రవి యాదవ్ పలు సూచనలు చేశారు. పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్ బాక్స్ ఓపెన్, క్లోజ్ చేయడం తదితరాలపై సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం తగదని సూచించారు. కార్య క్రమంలో అధికారులు సూపరింటెండెంట్ శ్రీనివాస్, సాయిరాం, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల సామాగ్రి ఏర్పాట్లను పరిశీలించిన ఎంపిడిఓ

సిర్గాపూర్, డిసెంబరు 12, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు ఈనెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల సామాగ్రి ఏర్పాట్లను మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి శారదదేవి శుక్రవారం పరిశీలించారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా 7 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా 21 పంచాయతీలకు 17న ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్నికల సామాగ్రి ప్యాకింగ్‌ను నిర్వహించారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

సిర్గాపూర్, డిసెంబరు 12, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని అభ్యర్థులు మద్దతుదారులతో కలిసి చేస్తున్న ప్రచారం ఊపందుకుంది. సిర్గాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్‌రావుపాటిల్ శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ఆరంభించారు. గ్రామంలోని ఆయా వీధుల్లో తన మద్దతుదారులతో ఇంటింటికి చేరుకుని గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామి చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. 2006 నుంచి 2011 వరకు గ్రామ సర్పంచ్‌గా పలు అభివృద్ధి పనులు నిర్వహించినట్లు గుర్తు చేస్తున్నారు. తనకు మరో మారు అవకాశం కల్పించి గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి చేస్తున్నారు.

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిడివో

సిర్గాపూర్, డిసెంబరు 12, ప్రభాతవార్త: ఈ నెల 17వ తేదీన మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలకు జరగనున్న 3వ విడత పంచాయతీ ఎన్నికల్లో మండల ఉద్యోగులు పోస్టర్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి శారదదేవి సూచించారు. ఈ నెల 13, 14, 15వ తేదీలలో సిర్గాపూర్‌లోని రైతువేదికలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. ఇంతవరకు పోస్టర్ బ్యాలెట్‌కు దరఖాస్తులు చేసుకోని ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించే 3వ విడత దృవపత్రంలో నేరుగావచ్చి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ఎంఈఓ నాగారం శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఎన్ శ్రీనివాస్‌లు పర్యవేక్షణ చేస్తారన్నారు.

హ్యాట్రిక్ సాధించిన సర్పంచుకు గ్రామస్థుల సన్మానం



సర్పంచును సన్మానిస్తున్న గ్రామస్థులు

సదాశివపేట, డిసెంబరు 12(ప్రభాతవార్త): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆరూరు గ్రామ సర్పంచ్ గా మూడవసారి నాయి కోటి లావణ్య మధు గెలుపొందిన సందర్భంగా గ్రామస్తులు వారిని సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నాయి కోటి లావణ్యమధు మాట్లాడుతూ తనను వరుసగా మూడవసారి, హ్యాట్రిక్ సర్పంచ్‌గా గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కాకుండా గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి,టీజీఐఐసీ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో గ్రామానికి నిధులు తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. వార్డు మెంబర్లకు శాలువా వేసి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాదరి విటల్, వార్డు మెంబర్లు దానయ్యగారి భరత్‌కుమార్, బొబ్బిలిగామ భాగ్య లక్ష్మి, టేకూరి అంజయ్య, మన్నే నాగేష్ , తుమ్మలపల్లి భారతమ్మ, మన్నే రమేష్ కుమార్, నాగేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటా : చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

టిఆర్ఎస్ మద్దతుతో గెలుపొందిన అభ్యర్థులను సన్మానిస్తున్న దృశ్యం

గుమ్మడిదల డిసెంబరు 12 ప్రభాతవార్త : ఎల్లప్పుడూ అండగా ఉంటా అని బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలపరిధిలో మంబాపూర్, కానుకుంట, నల్లవల్లి, రాంరెడ్డిబావి గ్రామాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన బిఆర్ఎస్ మద్దతు తెలిపిన సర్పంచ్ అభ్యర్థులను శుక్రవారం ఆయన కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి అభ్యర్థుల నుంచి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గెలుపోటములు రాజకీయాల్లో సహజమన్నారు. పార్టీ అభ్యర్థులు, నాయకులు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన అభ్యర్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, నాయకోటి రాజేష్, మాజీ జెడ్పిటిసి కుమార్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, హుస్సేన్, శ్రీకాంత్‌గౌడ్, సత్యనారాయణ, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ అప్ప, రమేష్ అప్ప, చక్రపాణి, సంజీవరెడ్డి, ఉమ్మారెడ్డి, పోచయ్య,ముద్రికచారి మహేష్, ఆంజనేయులు, చాకలి ప్రకాష్,కాంతారావు, రాజు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోండి : నీలం మధు

గుమ్మడిదల డిసెంబరు 12 ప్రభాతవార్త : పంచాయతీ ఎన్నికల్లో ఓటేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూ అండగా నిలబడాలని నూతన సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు సూచించారు. నల్లవల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంఆర్ యువసేన అభ్యర్థిగా ఘనవిజయం సాధించిన నల్లవల్లి నూతన సర్పంచ్ కోరవి రాణిసురేష్, కానుకుంట వార్డ్ సభ్యులు శుక్రవారం నీలం మధును క్యాంపు కార్యాలయంలో గ్రామస్థులతో కలిసి శాలువతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని నీలం మధు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్లవల్లి వార్డ్ సభ్యులు నర్సింలు స్వరూప, కానుకుంట వార్డ్ సభ్యులు పోతురాజు నవీన్, ఎల్లబోయిన ప్రేమ్ దాస్, ఏళ్లబోయిన నాగరాజు, ఎర్రోల నరేష్ బాబు, కాంగ్రెస్ శ్రేణులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన అభ్యర్థులకు సన్మానిస్తున్న దృశ్యం

అమీన్‌పూర్‌లో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు : ఎమ్మెల్యే

పటాన్‌చెరు, డిసెంబరు 12, ప్రభాతవార్త

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ప్రతిపాదించిన ఎస్టిపిప్లాంటును ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఏర్పాటు చేయబోతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలోని 993 సర్వే నెంబర్ పరిధిలో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు కోసం నిర్దేశించిన స్థలాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో 1100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వేనంబర్ పరిధిలోని 10 ఎకరాలలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి గతంలో ప్రతిపాదనలు చేయడం జరిగిందని తెలిపారు. ఇదే సర్వే నెంబర్ లో 5 ఎకరాలు స్టేడియానికి, పది ఎకరాలు నవోదయ విద్యాలయానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎస్టిపి ప్లాంట్‌ను స్టేడియానికి కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారని, దీని మూలంగా స్థానిక కాలనీల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు తనకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. స్టేడియానికి కేటాయించిన స్థలంలో కాకుండా కాలనీలకు దూరంగా కేటాయించిన పది ఎకరాలలోనే ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆయన ఆదేశించారు. నూతన టెక్నాలజీతో ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దుర్వాసన తలెత్తకుండా ప్లాంటు పనులు కొనసాగుతాయని తెలిపారు. తాము ఎప్పుడూ ప్రజల పక్షమేనని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమం లో అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ జ్యోతిరెడ్డి, తహసీల్దార్ వెంకటేష్, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గోపాల్, యూనుస్, రాములు, జగదీష్, పాల్గొన్నారు.

ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

సునీతకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

సిపిఐ మాజీ మండల కార్యదర్శి సునీతకు ఘన నివాళి

సదాశివపేట, డిసెంబరు 12 (ప్రభాతవార్త): సిపిఐ మాజీ మండల కార్యదర్శి టీ.సునీత రెండో వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి అనుసుజయాదవ్,నాయకురాలు తుమ్మపుడి బజ్జమ్మ మాట్లాడుతూ సునీత ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సాదిక్‌అలీ. పూలమ్మ, బిపాషా, దేవి, రహిమబీ రాజమ్మ, రఫీ, ముంగి రమేష్. చాకలి సంధ్య. మహిళ సమాఖ్య నాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

పేటలో మొరాయిస్తున్న సర్వర్లు

కుల, ఆదాయ, నివాస. ధ్రువపత్రాలతో తిప్పలు

సదాశివపేట, డిసెంబరు 12 (ప్రభాతవార్త): మండల కార్యాలయంలో 20 రోజులుగా గురుకుల ఆదాయ నివాస ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకోగా సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వర్ లేదంటూ తిప్పుతున్నారు. విద్యార్థులతో పాటు పలువురు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పనులు కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల స్కాలర్షిప్‌ల కోసం గడువు ముగుస్తుండడంతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. కావున సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ధ్రువపత్రాలను సకాలంలో అందేలా చూడాలని పలువురు కొరుతున్నారు.

సత్యసాయి సేవలు మరువలేనివి : నందకిషోర్

కొండపాక, డిసెంబరు 12, ప్రభాతవార్త : కొండపాక శివారులోని శ్రీ సత్య సాయి సంజీవని చిన్నారుల గుండె సంరక్షణ పరిశోధన కేంద్రంలో శుక్రవారం జీవిత బహుమతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బిఐ మ్యూచువల్ పండ్ ఎండి నందకిషోర్ మాజీ ఐఎఎస్ అధికారి రమణచారి పాల్గొన్నారు. ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్ వారు సంజీవని చిన్నారుల గుండె సంరక్షణ కేంద్రానికి రూ॥ 1.6 లక్షల విలువైన హర్ట్, లంగ్ మెషన్‌ను విరళంగా ఇచ్చినట్లు సత్య సాయి సంజీవని హస్పిటల్ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. సహాయం చేసినందుకు ఎస్‌బిఐ వారికి అయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రమణచారి చేతుల మిదుగా అపరేషన్ అయిన తర్వాత బాగయిన చిన్నారులకు బహుతులను అందించారు. అనంతరం నందకిషోర్ మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. చిన్నారుల గెండెలకు ఉచితంగా అపరేషన్ చేసి మరో జన్మ ప్రసాదిస్తున్న డాక్టర్ల సేలవలు ప్రశంస నియమన్నారు. పేషంట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. జీవితాంతం సంజీవని హస్పిటల్ నిర్వహకులకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో అసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీనియస్ స్కూల్‌కు రాష్ట్రస్థాయి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్

సదాశివపేట, డిసెంబరు 12(ప్రభాతవార్త): బ్రెయిన్ ఎడ్యుకేషనల్ మ్యాగజైన్ హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన ఎడ్యుకేషన్, ట్రైనింగ్ రిసోర్సెస్ టెక్ ఎక్సో 2025లో బెస్ట్ అకాడమిక్ ఎక్సలెన్స్, బెస్ట్ ఎమర్జెంట్ స్కూల్, బెస్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్కూల్‌గా 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రస్థాయి స్కూల్ ఎక్సలెన్స్ అవార్డ్‌ను జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలోని టాప్ 20 అత్యుత్తమ స్థాయి పాఠశాలలో జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ నిలబడి ఈ అవార్డును గెలుపొందింది. అవార్డ్‌ను బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ బ్రహ్మం కాకాని నుండి జీనియస్ స్కూల్ తరుపున పాఠశాల కరస్పాండెంట్ రఘు వర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రీతి అందుకున్నారు.

ఆవార్డు అందుకుంటున్న జీనియస్ స్కూల్ కరస్పాండెంట్

నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు : ఎమ్మెల్యే

నారాయణఖేడ్, డిసెంబరు 12 ప్రభాతవార్త : పట్టణంలోని 14వ, 15వ వార్డుకు చెందిన శ్రీమతి షరీఫ జైనబ్, శ్రీమతి తబస్సున్ బేగం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చాలని ఉద్దేశంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన బహు పేదలందరికీ ఐదు లక్షల చొప్పున అందివ్వడం జరుగుతుందని దానిని అందరూ సద్వినియోగం చేసుకొని ఇండ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు వాస్తవ రూపం దాలుస్తున్నాయని చెప్పారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని, కొన్ని పూర్తి చేసుకుని గృహప్రవేశం జరుగుతుండగా మరికొన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అచ్చంపేటలో ఘనంగా బండ్ల ఊరేగింపు

నర్సాపూర్ డిసెంబరు 12 ప్రభాతవార్త : మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో రెండు మూడు రోజులుగా ముత్యాలమ్మ శీతలమాత జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాగా మొదటిరోజు అమ్మవార్లకు అభిషేకం, బోనాల ఊరేగింపు, ఒడిబియ్యం సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించగా శుక్రవారం ఘనంగా బండ్లను ఊరేగించారు. ఎద్దుల బండ్లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగించారు. అంతేగాక బెస్ట్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గొర్రె పొట్టేళ్ల బండిని శీ తాలమ్మ నల్ల పోచమ్మ జాతర సందర్భంగా ఊరేగించారు. ఈ గొర్రె పొట్టేళ్ల బండి జాతర ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ మేరకు గ్రామస్తులంతా ఎంతో భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో ఈ జాతర ఉత్సవాలను జరుపుకుంటున్నారు. శనివారం రోజున గావు రంగాలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలకు పరిసర గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ జాతర ఉత్సవాల్లో పండగ ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో పండగ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు వేణు,రాము, మధు, ప్రవీణ్ రవితేజ రాజారాం, ఆర్కె రవితేజ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో రజనీకాంత్ అభిమానుల అన్నదానం

గజ్వేల్ టౌన్, డిసెంబరు 12 (ప్రభాతవార్త): సూపర్‌స్టార్ రజనీకాంత్ 75వ జన్మదినం సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లోని మాత శిశు కేంద్రం వద్ద రజనీకాంత్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చాకలి పోచయ్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ రజనీకాంత్ మనకు సినీ హీరో మాత్రమే కాదని, సేవా మార్గంలో ప్రేరణ అని అన్నారు. ఆయన జన్మదినం ప్రతి సంవత్సరం ఇలా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, డిసెంబరు 12 ప్రభాతవార్త : గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం శివంపేట మండలంలోని చెంది, దంతాన్ పల్లి, భీమ్లాతాండ, ఉసిరికపల్లి, సీతారాంతాండ, ఎదుల్లాపూర్ అల్లిపూర్ గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుల గెలుపు కోసం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల పేరుతో గద్దెనెక్కి ప్రజలకు గ్యారెంటీలు అమలు చేయకుండా మోసం చేశారని గుర్తు చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని, గ్రామాలలో అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు, తూము కృష్ణారావు, మొలుగు నాగేశ్వరరావు, మర్రి సత్తిరెడ్డి, మహేందర్ రెడ్డి, మర్రి మల్లారెడ్డి,మాజీ సర్పంచ్ దుర్గేష్ , సోము అశోక్, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,రాజేందర్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

తెలంగాణ సర్పంచ్ ఎన్నికలు - మొదటి విడత ఫలితాలు

గుమ్మడిదల, డిసెంబరు 12 ప్రభాతవార్త :

మండలంలో నిర్వహించిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికలు ఆసక్తికర రాజకీయ పరిణామాలకు వేదికయ్యాయి. గ్రామాల్లో ప్రజలు ఆలోచించి ఓటువేసిన తీరుచూస్తే అభివృద్ధి, నాయకుల వ్యక్తిత్వం, స్థానిక సమస్యల పరిష్కారం ఇవే ప్రధానంగా ప్రభావం చూపిన అంశాలుగా కనిపిస్తున్నాయి. ఈ విడతలో కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ గ్రామాల వారీగా ఆధిపత్యం చాటుకోగా,ప్రతి గ్రామంలోనూ ప్రజా స్వరం స్పష్టంగా వినిపించింది. గ్రామాల వారీగా ఫలితాల విశ్లేషణ కొత్తపల్లి - బీఆర్ఎస్ ఉత్సాహం 68 ఓట్ల ఆధిక్యం బీఆర్ఎస్‌కు గ్రామంలో ఉన్న బలాన్ని మరలా గుర్తు చేసింది. అభ్యర్థి పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం స్పష్టంగా కనిపించింది. మంబాపూర్ - కాంగ్రెస్ ఆకర్షణ కొనసాగుతుంది. 29 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి గెలవడం గ్రామస్థుల అభిలాషను ప్రతిబింబిస్తోంది. కానుకుంట-కాంగ్రెస్‌కు ఘన విజయం 270 ఓట్ల భారీ మెజారిటీతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ప్రాంతంలో ఇది కాంగ్రెస్ పక్షాన కీలక విజయంగా గుర్తించబడుతోంది. కాంగ్రెస్ కు కంచుకోటగా మారింది అనంతారం - 251 భారీ లీడ్‌తో బీఆర్ఎస్ విజయం సాధించటం స్థానిక నాయకత్వంపై ప్రజలు చూపుతున్న విశ్వాసానికి నిదర్శనం. నల్లవల్లి- అభ్యర్థి సంచలనం ముఖ్య పార్టీలను పక్కనబెట్టి 19 ఓట్ల తేడాతో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.రాం రెడ్డి బావి - కాంగ్రెస్ ఆధిక్యం స్పష్టంగా 51 ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ స్థానికంగా బలపడుతోంది.వీరారెడ్డి పల్లి - బీఆర్ఎస్ అతి పెద్ద విజయం 305 ఓట్ల తేడా ఈ ఎన్నికల్లో ఆ గ్రామానికి ప్రత్యేక గౌరవం తెచ్చింది. ఇది తొలి విడతలో వచ్చిన అత్యధిక లీడ్‌లలో ఒకటి.నాగిరెడ్డిగూడెం- బీఆర్ఎస్ మరోసారి విజయ పతాకం 90 ఓట్లలీడ్ అభ్యర్థి ప్రతిభతో పాటు పార్టీ ప్రభావం కూడా స్పష్టంగా తెలిపింది.ఈ ఫలితాలు గ్రామాల్లో రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయని అభివృద్ధి చేస్తేనే ప్రజలు మళ్లీ నమ్మకం ఉంచుతున్నారు. స్థానిక నేతలు ప్రజల్లో పరిచయాన్ని పెంచుకుంటేనే విజయం దక్కుతోంది.పార్టీ ప్రభావంకంటే అభ్యర్థి వ్యక్తిత్వం ముఖ్యమవుతోంది. ప్రజాస్వామ్య పండుగగా గ్రామాలు ఎన్నికల రోజు గ్రామాలు పండుగల్లా మారాయి. పెద్దలు-చిన్నలు ఓటు హక్కును వినియోగించేందుకు ఆసక్తిగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.ఫలితాల ప్రకటనా సమయంలో గ్రామాల్లో ఉత్కంఠ వాతావరణం నెల కొంది. విజయం సాధించిన అభ్యర్థుల ఇంటి వద్ద సంబురాలు ఉధృతంగా జరిగాయి. మండలంలోని గ్రామాల్లో గెలుపొందిన అభ్యర్థులు సర్పంచులుగా కొలువు తీరారు.

గుమ్మడిదల మండల ప్రజాపరిషత్

16 పంచాయతిల్లో కాంగ్రెస్ హవా

-4 స్థానాలతో ఉనికి చాటుకున్న బిఆర్ఎస్

అల్లాదుర్గం, డిసెంబరు 12, ప్రభాతవార్త: మొదటి విడతలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన మెజార్టీ అభ్యర్థులు విజయదుంధుబి మోగించారు. మండల పరిధిలోని 16 పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు 12 స్థానాల్లో విజయం సాధించగా బిఆర్ఎస్ మద్దతులో బరిలోఉన్న 4 పంచాయతీ స్థానాల్లో విజయం సాధించారు. పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి సర్పంచ్‌గా ధృవీకరణ పత్రాలు అందుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి. మేజర్ పంచాయతీ అయిన అల్లాదుర్గంలో కాంగ్రెస్ రేబల్ అభ్యర్థి మద్దూరి సౌమ్య కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికలో పోటీచేసిన కర్రోళ్ల స్వరూపపై 421 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రెడ్డిపల్లి సర్పంచ్‌గా నర్సారెడ్డి 57 ఓట్ల మెజార్టీతో, రాంపూర్‌లో గోపాల్‌రెడ్డి(కాంగ్రెస్), మందాపూర్‌లో కోర్పోల్ రమ్య(కాంగ్రెస్), కాయిదంపల్లిలో వంకిడి రేణుక (కాంగ్రెస్), ముప్పారంలో వీరబోయిన కవిత(కాంగ్రెస్), వెంకట్రావ్‌పేట్‌లో శ్రీనివాస్‌రెడ్డి(కాంగ్రెస్),నడిమితండాలో శంకర్‌నాయక్(కాంగ్రెస్), గొల్లకుంట తండాలో నాయక్(కాంగ్రెస్), బహిరన్‌దిబ్బలో వీరన్న(కాంగ్రెస్), చిల్వర్‌లో శశిదర్‌రెడ్డి(కాంగ్రెస్), సీతానగర్‌లో పత్రే శోభ (బిఆర్ఎస్), ముస్లాపూర్‌లో జ్యోతి(బిఆర్ఎస్), చేవెళ్లలో మచ్చేందర్(బిఆర్ఎస్), అప్పాజీపల్లిలో గంధాలి రవి (బిఆర్ఎస్)లు తమ ప్రత్యర్థులపై విజయం సాధించి గ్రామ ప్రథమ పౌరుడు (సర్పంచ్‌గా)